# సౌభాగ్యం

## చందు సుబ్బారావు

వీరమ్మ చూపులకు తుమ్మచెట్టుకు బొట్టు పెట్టినట్లుండేది ! వీరమ్మ పని మంతురాలు. మరుదాంఘ్గుమ ...సుఖ మెరగని ప్రాణం. మొండిఘటం.... అనే వాళ్ళు, అంటే ఏమిటో నాకెంతకూ బోధ పడేదికాదు ....

అక్షరం ముక్కరాని వీరమ్మకు అన్నీ నోటి లెక్కలే...

ఉప్పు, పప్పు, ఉల్లిపాయ, చింతపండు, మిరపకాయ ... వగైరా సమస్తమూ ఊళ్ళో పెద్ద కొట్లలోకొని తట్టెడు వస్తువులు నెత్తిన పెట్టుకుని మోసుకుని యింటి కొచ్చేసరికి కాళ్ళు తడబడేదీ .... ఇంటి అరుగుమీద కూచున్న ముసలాడు దించటానికి ఎదురొచ్చేవాడుకాదు ... ఒకవేళ బరువు పట్టుకోలేక 'ఏవయ్యోవ్ కట్టుకున్నాయన, ఒక్క చెయ్యేసి దింపుతా' అనడిగేది ....

'ఓసి నీయమ్మ, చాతకాని ముండ... నన్ను దింపమంటావ్' అని విసుక్కునే వాడు.

వీరమ్మ వణికెకాళ్ళతో 'ఓరినీమనిషి కాల' అని 'ఒసే అంజావ్ .... ఒసేపుల్లీ, అరె ఎంకాయ్ ... సోవుడూ ... ఎవరన్నా ఇటొచ్చి దింపండర్రా' అని కేకేసేది.

ప్రక్క గుడిసెల్లో నుంచి ఎవరో ఒకరు పరుగెత్తుకొచ్చి దించేవారు....దించినోళ్ళు,

"ఏంది ముసలాయన ... అమ్మమ్మ అట్టా బరువుతో ఉంటేలేవి అందుకోవే" అనేవాళ్ళు ....

"ఓసి సాని దాని కొడక ... నీసలా ఎవడడిగాడు...పో అవతలకి" అని కసిరేసేవాడు ... వాడు బిత్తరపోయి.

"అమ్మమ్మ ... ఏందీ ముసలాయన, నీ సొమ్ము తింటా నిన్ను కసురుతాడేంది. తలమీద బరువు దించలేడూ ..." అనడిగితే ...

"బరువు కాదురా పరవాత్మా. కొరివి పెట్టడు" కొట్లో కూచుని అనేది వీరమ్మ.

వీరమ్మను పల్లెజనం అంతా 'అమ్మమ్మ' అని పిలిచేవాళ్ళు. కొట్టు సామాన్లు అమ్మటమేకాదు ...

నిత్యం వాళ్ళ కష్టసుఖాలు వినేది. మొగుడూ పెళ్ళాల తగువులు తీర్చేది. చిల్లర మల్లర జబ్బులకు మందులిచ్చేది. కడుపు రాకపోతే ఏంచేయాలో ... వస్తే ఏంచేయాలో ఆడంగులకు 'సలా' లు యిచ్చేది.





మొగుడు కొడితే వీరమ్మకు మొర పెట్టుకునేవాళ్ళు ... మగాళ్ళను పిలిచి చివాట్లు పెట్టేది. మొగుడుచాటున ఓ ఆడది కప్పదాటువేస్తే వీరమ్మ చక్రం అడ్డం వేసేది.

"చాపలకు పోయిందిలేరా పోలిగా... ఊరికే గుచ్చి గుచ్చి యివరాలు కావాల, పో అవతలకి" అని పోలమ్మను రక్షించేది.

"ఎద్దంత మొగుడు, లంజ.... రెండో సారి తప్పుడుపని చెయ్యమాక .... వదిలేస్తాడు పో" అని పోలమ్మను హెచ్చరించేది.

అప్పులిచ్చి అన్నం పెట్టింది. చెరో అబద్ధమూ చెప్పి కాపరాలు నిలబెట్టింది. వెయ్యి మాటలు చెప్పి పెళ్ళిళ్ళు చేసింది. ఎవరైనా దిక్కులేని చావు చస్తే దగ్గరుండి దినవారాలు చేయించింది.

పల్లెకారుజనం అందరికీ పీరమ్మ, 'పీరమ్మమ్మమ్మ' అయ్యింది అందుకే. తన్ను కట్టుకున్న ముసిలోడు వెంకట్రామయ్య మాత్రం 'తాతయ్య' అవ్వలేదు. పల్లె జనానికి ముసిలాడ్ని చూస్తే వొళ్ళు మంట.

తెల్లవారుజామున లేచి, పోయి సరుకులు తెచ్చుకోవాలి...

తెల్లవారేముందుగా పప్పురుబ్బి పునుగులూ, గారెలూ, చేగోడీలు, జంతికలు చేసి కొట్లో పెట్టుకోవాలి.

పొద్దుపొడిచేముందు కొట్టి కాక్కాలి. పినిమిది కొట్టేసరికి ముసిలాడు "దీనెమ్మ కొట్టెక్కింది. నల్లమొద్దు, కాఫీ ఎవడిస్తాడు" అని గుంజుకునేవాడు.

పీరమ్మ గబగబా లేచొచ్చి కాఫీబెట్టి, ఆవకాయ పచ్చడివేసి ముసలాడిముందు ముక్కాలిపీట వేసి పెట్టేది. కాసేపాగి మళ్ళీ ముసలాడు —

"మంచినీళ్ళు దీనెమ్మ మొగుడిస్తాడు కాబోలు" అంటుండటం కొట్టుమీదున్న పీరమ్మ విని —

"అరెరెరె పుల్లిగా, మీ తాతయ్యకు మంచినీళ్ళు మరిచి పోయాను .... ముసిలి ముండను .... కాస్త అందియ్యరా" అని కొట్టుకొచ్చిన పుల్లయ్యతో అనేది. వెంకట్రామయ్య చివాలున లేచిపోయి ....

"ఓసి, సానిముండ .... పల్లెకుర్రోడి చేత్తో మంచినీళ్ళు తాగమంటావ్ .... నువ్వంటే జాతిలేని ముండవి, నీతిలేని పనులు చేస్తావ్....నన్ను చెయ్యమంటావ్ సానిదాని కూతుర" అనేవాడు .... విన్న పుల్లిగాడు చాలా ఆశ్చర్యపోయి, బాధపడి ...

"అమ్మమ్మా! ముసిలాణ్ణి ఎందుకట్టా బరిస్తన్నావ్?"

"బరతగదనాయనా? బరించక తప్పేదేముంది?"

"ఎంత పొగరు? అమ్మతల్లిలాంటి దాన్ని నిన్నే సానికూతురంటన్నాడు .... గన్నేరుపప్పు ఏసెయ్యలేవ్వా?"


"ఏమేత్తాంరా పుల్లయ్యా? ఇదిగో పసుపూ, కుంకుమా తగలడతయ్యిగదా అని వూరుకుంటున్న. పొద్దున్నే కోమట్ల కొంపలకుపోయి నిదర ముహాల్న చూడాల తుమ్మచెట్టుముహం అయినా ఆ బొట్టుండబట్టి 'ఏం పీరమ్మతల్లీ? రా....రా' అంటన్నారు. యీ ముసిలాయన చస్తే ఎవరకు ఎదురైనా పొద్దున్నే దాపరించిందంటార్రా నాయనా' అని చెప్పేది.

పీరమ్మ చెప్పేది 'సబబే'. ఏదో ముసలాడు కుక్కకాపలా ఉండనియ్యి అనుకోవచ్చును ...కానీ అది ఇప్పుడే నిజం ... మొదట్నుంచీ కాదు.

* * *

పీరమ్మ కిప్పుడు డెబ్బయ్యేళ్ళు .... ఈ వేళ వెంకట్రామయ్యను ఎందుకు భరిస్తుందో చెబితే ఎవరైనా అర్థం చేసుకుంటారు. డెబ్బయ్యేళ్ళుగా ఎలా భరించిందో చెబుతే ఎవరూ నమ్మరు. నమ్మినా ఆమోదించరు.






వెంకట్రామయ్యకు పీరమ్మనిచ్చి నాలుగో ఏట పెళ్ళి చేసారు. పెళ్ళిలో పిల్లాడు దివిటీలా వెలిగిపోయాడట ... పక్కన పీరమ్మ చింతపండు కట్టలా కనిపించిందట.

పీరమ్మ పయస్కురాలైందాకా వెంకట్రామయ్యకు నలుపూ తెలుపూ తేడా తెలియలేదు...నిజం చెప్పాలంటే ఇద్దర్నీ కలిపిన ఏడాది దాకా తెలియలేదు. తెలుసుకునేలోపు నల్లటి పీరమ్మకు దేవుడిచ్చిన వరంలా తెల్లటి పిల్ల పుట్టింది.

'జ్ఞానలక్ష్మి' అని పేరుపెట్టాడు పురోహితుడు.

పిల్ల పుట్టింతర్వాత వెంకట్రామయ్య పీరమ్మ జోలికి మరి పోలేదు. పుట్టింటి నుంచి కాపరానికి తీసుకురానూలేదు.

గిరజాలు దింపి, లాల్చీవేసి, అత్తరు రాసి, చుట్ట వెలిగించి కొంకె కర్రపట్టుకుని నడిచే వెంకట్రామయ్య వల్లెవాటును చూసి ఆ ఊళ్ళో వారకాంతలు కాలు కదలనిచ్చేవాళ్ళు కాదట.

వనజమ్మా ... సోములమ్మా... శ్రీశైలం ... కనకాంబరం....నగరాజి, పాపాయి, రాఘవాయీ ... ఇలా నాలుగేళ్ళ కొకరు మారుతూ వచ్చేసరికి నలభై ఏళ్ళ కాలం గడిచింది. నాలుగెకరాల మాగాణి హరించుకుపోయింది.

పీరమ్మను కూతుర్నీ ... అన్నలు నలుగురూ పోషించారు .... పోషించారంటే వూరికినేకాదు... గేదెపెట్టిన దున్నకుర్ర ఒకటుంటే రెండోదాని క్రింద పీరమ్మను కట్టుకుని కొంగ్రదున్నుకుంటూ, పంట పండించుకు తింటూ పోషించారు...ఏ మాటకామాట చెప్పుకోవాలి.

పీరమ్మ కేలోటూ రాకుండానేచూశారు, జ్ఞానలక్ష్మిని 'గేనలచ్చమ్మా' అంటూ బుజాలమీద మోసి పెంచారు. మా తుమ్మచెట్టు కడుపున 'పూలకుండీ' పుట్టిందిరా! అనుకుంటూ....ఈమధ్య వెంకట్రామయ్య రాలేదా ? అంటే వచ్చాడు. లేదా కబురు పంపాడు.

ఊళ్లో 'ప్లేగు' వ్యాధి వచ్చింది. ఎలికలు చచ్చిపోతున్నాయి .... వెంకట్రామయ్యకూ్కడా సోకింది. రమ్మని కబురు పంపారు. అప్పుడొకసారీ ... కలరా వచ్చినప్పుడొకసారీ ...

మశూచిసోకి మంచంలో పడుంటే వనజమ్మా, సోములమ్మా, వెంకాయమ్మా ఎవరూ ముట్టుకోరాలేదు. వీరమ్మవచ్చి వెంకట్రామయ్యకు నెలరోజులపాటు ఒకటీ, రెండూ ఎత్తిపోసింది. వేపమండల్తో విసిరింది. కారుతున్న రసి తుడిచి శుభ్రం చేసింది.

కుండలు ఎండి కొత్త పొలుసులు రాలంగానే వెంకట్రామయ్య వీరమ్మను పుట్టింటికి పంపించాడు. ఈసారి క్షయ పుట్టిందాకా రానక్కరలేదన్నాడు!!

వీరమ్మ భుజంమీద చీరె చుట్టుకుని పుట్టింటికి పోయింతర్వాత వెంకట్రామయ్య పాపాయమ్మ యింటికి పోయాడు.

ముఖంమీద మచ్చలుపడి వికృతంగా వున్న వెంకట్రామయ్యను చూసీ చూడగానే పాపాయమ్మ 'లోన' మనిషున్నాడని కబురు పంపింది.

సోములు తక్కువ కులంది కావటంచేత "సరేరండి...కానీ నెలదిరక్కుండా నాకు మామిడి పిందెల గొలుసు చేయిస్తానని మాటిచ్చి మరీరండి" అంది.

'అలాగేనని' నవ్వాడు వెంకట్రామయ్య.

"అమ్మవారొచ్చిన మనిషి అరవై రోజులు ఆడదాన్ని తాకరాదు. దూరంగా పడుకో ...." అని పక్కకు తిరిగి పడుకుంది సోములమ్మ.

"ఇహిహిహి" అని నవ్వి వెనకనుంచి మనిషి మీద చెయ్యివేసి తృప్తి పడ్డాడు వెంకట్రామయ్య.

* * *

జ్ఞానలక్ష్మి పెళ్ళయి వెళ్ళిపోయాక, వీరమ్మ అన్నయ్యలు ఇద్దరు ఒకసారి కృష్ణ వరదల్లో చచ్చిపోయారు. మూడో వాడు నిన్ను నేను పోషించలేనన్నాడు. నాలుగోవాడు పొట్టపట్టుకుని బెజవాడ పోయాడు.

వీరమ్మ స్వయంగా పొలందున్నినాట్లు వేసుకుంది. వడ్లబస్తా మోసింది ... పచ్చి మాగాణిలో నారుమోపులు నెత్తిన పెట్టుకుని నడిచింది. 'పది వోదెల' వరికట్టతో నిచ్చెనెక్కి కుప్పమీద విసిరింది.

తాను ఆడమనిషినన్న విషయం వీరమ్మ ఎప్పుడో మరచిపోయింది.

పాడు శరీరం కొంతకాలం గుర్తు చేసి చేసి, విసిగిపోయి వీరమ్మకు విశ్రాంతినిచ్చింది. ఇప్పుడు వీరమ్మ మినప బస్తా ఎత్తుకుంటుంది. మా రేడు పల్లి జనం యావత్తూ ముక్కుమీద వేలేసుకున్నారు!

* * *

కలరా వచ్చి మూడో అన్నయ్య చచ్చిపోయింతర్వాత వీరమ్మకు వూళ్ళో అండ లేకపోయారు. తన కండలే అండ, తన చెమటే స్నేహితులు, కాళ్ళే బంధువులు, కన్నీళ్ళే కావలసినవాళ్ళు అనుకుని పదేళ్లు బ్రతికింది. అంటే వొక్కమాట, బ్రతికింది అహోరాత్రాలూ అఘోరిస్తూ 'అలో లక్ష్మణా' అంటూ బ్రతకలేదు.

గానుగెద్దులా తిరిగి సున్నం పిండిపిండి చేసింది. మైలురాయిలా ఎండకూ వానకూ,



ఎండింది. పళ్ళచెట్టులా కాయలు కాసింది. తన ఫలాలు కోసి యితరులకిచ్చి మళ్ళీ చెట్టయి నిలిచిపోయింది.

అప్పుడప్పుడూ జ్ఞానలక్ష్మి, అల్లుడూ, పిల్లలూ రాగా, చూసుకుని మురిసిపోయింది. తన చెమట బ్రతుకులో వరాల మూట దొరికినట్లు సంబరపడిపోయింది. జ్ఞానలక్ష్మినీ పిల్లల్నీ ... పూలమీదకాదు ముత్యాలమీద నడవమంది. మూటలుగట్టి పంపిస్తాను అన్నది. అన్నంతపనీ చేసింది.

వెంకట్రామయ్యను పూర్తిగా మరిచిపోయే వయసూ, మనసూ వీరమ్మకొచ్చాయి. ఇహ కన్నుమూద్దాం అనుకుంటూండగా

'వెంకట్రామయ్య సుఖవ్యాధుల్తో తీసుకుంటున్నాడని' కబురొచ్చింది. ఉన్న యిల్లు శ్రీశైలం రాయించుకుందనీ, ఉత్త చేతుల్తో ఉన్నాడనీ, నవరంధ్రాల్నుండి చీమూ నెత్తురూ వస్తున్నాయని వార్త.

అయితే వెంకట్రామయ్య భార్యను రమ్మని కబురు పంపలేదు సుమండీ! వార్త చేరిందంతే ... వీరమ్మ వెళ్ళకపోను ...

అప్పట్లో ఓ చిన్న సంగతి జరిగింది.

వీరమ్మ సాగుచేసుకునే భూమి ప్రక్కనే పెద్దరెడ్డిగారి కొండ్ర వుంది. చిన్నగట్టు తగాయిదా ప్రారంభమై మాటా మాటా పెరిగింది. వీరమ్మ తగ్గలేదు.... నువ్వెంతంటె నువ్వెంతంది.

'నోర్ముయ్' అంటే తిరిగి పెద్దరెడ్డిని 'నోర్ముయ్' అంది. ఒక్కసారిగా వూళ్ళో వాళ్ళు, "అవురా, ఆడముండ, నల్లతుమ్మ లంజ పెద్దరెడ్డిని అంత మాటనటమా! మనం బ్రతికున్నామా ... చచ్చామా" అని తర్కించుకున్నారు.

"మిమ్మల్ని గట్టిగా ముద్దుపెట్టుకున్నవాడెవడో తెలియకపోతే ఎవరిపై కేసు పెడతాం. అయినా అతడి ముఖం చూడకుండా ఎలా ఉన్నారు మీరు" ఆశ్చర్యంగా అడిగాడు లాయర్ తన క్లయింట్తో.

"ఆ తన్మయత్వంలో కళ్ళు మూసుకున్నాను మరి...."

—కె. వి. మధుసూదనరావు,
కాకినాడ.

వీరమ్మ మీదకొచ్చారు.

"మీదచెయ్యిపడితే 'ఒకడివి' పట్టుకుని కొరికేస్తాను జాగ్రత్త" అంది మచ్చలపులిలా కనిపించిన వీరమ్మ. అంత పనీచేసుండేది. అంతదాకా వాళ్ళే పోలేదు. పరువూ ప్రాణమూ కాపాడుకున్నారు. పోలీసు రిపోర్టిచ్చారు! ఈ ఆడది మమ్మల్ని హత్య చేయాలనుకుంటుంది అవటా, అని. వాళ్ళు వచ్చారు మదుపు తిన్నంతసేపూ వీరమ్మను తిట్టి, వెళ్ళిపోయారు.

ఏమీ కాలేదుకాని, వీరమ్మ మనస్సు ఇన్నేళ్ళకు ఒక్కసారి చివుక్కుమంది.

పొలంలో రైతులు, ఊళ్ళో పెద్దలు, పైనుంచి పోలీసులు రాత్రనకా పగలనకా పైకొచ్చి యాగీ చేస్తుంటే ఒక్క మగాడైనా వచ్చి మాటసాయం లేకపోయనే.

ఒక్క మనిషి తోడు నిలబడి 'నీకెందుకు వీరమ్మ నేనున్నాను. ఉండు! అని చల్లని మాట చెప్పకపోయనే ...'

అని దిగులుపడింది వీరమ్మ. ఊరి రైతులు పలకరించకపోవటంతో గుండెల్లో బాధవేసింది. అప్పుడు తెలి

సింది వీరమ్మకు.

ఊరంతా ఒక కులమనీ ! తానొక కులమనీ. అంతే .... పొలం తెగనమ్మింది. సామాను పడవమీదవేసి కృష్ణ కాలవకెక్కించింది. ఇల్లు పైకప్పుకీకి పనికొచ్చే సామానంతా రెండోపడవెక్కించింది.

అటు అల్లుడు వాళ్ళ వూరికీ, ఇటు వెంకట్రామయ్య ఊరికీ మధ్య గొట్టిప్రోలు అనే వూరుంది. ఊరుబయట పల్లెకార్లుంటారు. వాళ్ళ దిబ్బమీద నాలుగుసెంట్లు స్థలం కొనుక్కుని సిమెంటు రాళ్ళతో యిల్లుకట్టింది. కొట్టు పెట్టింది.

వడర అంజావు, పుల్లాయి, నారిగాడు, ఆదిమ్మ, ఏసేబు, సువార్త, కిట్టప్ప, రాములమ్మ....సిసింద్రీ, టపాసూ చుట్టాలయ్యారు. నోరులేని ఆ జనం మధ్య బ్రతకటం వీరమ్మకు పండగయింది. వ్యవసాయం చేస్తున్న చేతులేమో కొట్టు పని పల్లేరుమీద బండినడకలా సాగింది'

జ్ఞానలక్ష్మి పిల్లలకు పెళ్ళిళ్ళయ్యాయి. మనవళ్ళు పుడుతున్నారు.

* * *

వెంకట్రామయ్య పాపాయమ్మ పంచలోచేరి బ్రతుకుతున్నాడట. ఎంతకీ ఛీ అన్నా ఛా అన్నా వెళ్ళటం లేదట. ఇలా కాదని పాపాయమ్మ ఎవరికో చెప్పి కత్తితో పొడిపించింది.

ప్రభుత్వ ఆసుపత్రిలో పడవేసారు. పోలీసులు వచ్చి 'వీరమ్మ అంటే ఎవరమ్మా' అని వాకబు చేసారు.

'నేనేనుబాబూ ! తమకేం కావాలి'

"నీ భర్త వెంకట్రామయ్యను ఎవరో కత్తితో పొడిచారు - చూద్దుగానిరా" అని తీసుకెళ్ళారు.

ఆదుగో...అప్పుడు వెంకట్రామయ్య వీరమ్మ దగ్గరకు చేరాడు. చేరాకుఅంటే నోరు తెరిచి పలకరించలేదు. ఎలా వున్నావని అడగలేదు. ఆకలేస్తే బూతులు తిట్టాడు.

అయిందానికీ, కానిదానికీ 'సానిదాని కూతుర' అన్నాడు. "ముసలాయనకు సానోళ్ళంటే చుట్టరికం. అందుకే ఆ మాటలు" అనిమాత్రం అనేది వీరమ్మమ్మ.

రోగాలన్నీ తగ్గాయి అనుకుంటే వెంకట్రామయ్య ఉబ్బసం పట్టుకొచ్చాడు. మరి ఎలా వచ్చిందో ? !

రాత్రిళ్ళు నస, ఖసకొట్టినట్టు ఖంగు ఖంగుమని దగ్గూ, కళ్ళె, పిల్లికూతలు.

"ఈ మందుబిళ్ళ మింగవయ్యా ముసలాయనా" అంటే 'ఆడబెట్టిపో అవతలికి' అని కసిరేవాడు.

ఆడబెట్టిన మందుబిళ్ళ కావాల ...

అది సంపాయించిన ఆడది మొహం చూపించరాదు.

* * *

వీరమ్మ ఎప్పుడు పుట్టిందో సరిగ్గా తెలిసేదికాదు నాకు.

పెద్ద గాలివానకు ముందనేది.

తాను పుట్టినప్పుడు ఆకాశంలో గొర్రెలు పరిగెత్తాయంట, అని చెప్పేది.

అప్పుడే ఇంగిసోళ్ళు బందరుకు రైలు పట్టాలు వేసారనేది.

తనకు పదేళ్ళనంగా ఊళ్లో తిరణాల జరిగింది. అమ్మోరికి వేటనేసాం .... ఆ ఏడు కరువొచ్చిందని చెప్పేది.

ఏ విధంగానూ వీరమ్మ పుట్టిన కాలం సరిగ్గా తెలియలేదు.

అటూ యిటూగా 1890...ప్రాంతం అనుకునేవాణ్ణి. రెండు శతాబ్దాల సుదీర్ఘ కష్ట జీవితం చూసిన వీరమ్మ, రెండేళ్ళ క్రితం తొంభయి ఎనిమిదో ఏట చనిపోయే దాకా తన జీవితకథంతా నాకు చెప్పేది.

* * *

ప్రాణం పోయేటప్పుడైనా వెంకట్రామయ్య వీరమ్మను పలకరించలేదు. వెక్కిళ్ళొస్తున్నాయి. ఇహ అయిపోతాడని అందరూ 'అమ్మమ్మ' వెళ్ళు వెళ్ళు అని పంపించారు.

వీరమ్మ వెళ్ళి రెండు చేతులూ పట్టుకుని "ఏమయ్యా...కట్టుకున్నాయన ... ఎలావుందీ" అనడిగింది.

స్పృహ తెచ్చుకుని వెంకట్రామయ్య "చీ...పో...ఎదవ మొహం నువ్వూను. ఎట్టా వుంటదీ" అని కసిరాడు కాసేపాగి.

"అమ్మాయ్, గేనలచ్చమ్మా ...." అని పిలిచాడు. కూతురు జ్ఞానలక్ష్మి వెళ్ళి తండ్రి తల దగ్గర కూచుంది.

కూతురి చెవిలో "లచ్చమ్మా ! ఎవ్వరికీ తెలియకుండా ఊరి కోమటాయన దగ్గర ఎయ్యిరూపాయలు దాచాను ఎళ్లి తెచ్చుకో" అన్నాడు వెంకట్రామయ్య.

లక్ష్మికి ఏడవాలో నవ్వాలో తెలియలేదు.

లక్ష్మి మెడపట్టుకుని వేలాడుతూ అలాగే ప్రాణం వదిలాడు.

"ఇంకేం ముసలాయన ? అయిపోయాడుగా .... కట్టెల అడితీకి పోయి రావాల. నాకు తప్పేదేముందీ" అంటూ లేచింది వీరమ్మ. [illegible] చనిపోయింది భర్తకాదు. తోటి మనిషి అనుకుంటూ...

మనమలూ, మునిమనుమలూ, మేమంతా వారిస్తున్నా "మీవల్ల ఏమవుద్ది? ఎండలో కందిపోతారు .... ఉండండ్రా" అని చెప్పులేసుకుని రోడ్డెక్కింది !

* * *

